క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



సెగిడిపేట పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

గార: మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలోని సెగడిపేట, జల్లపేట పోలింగ్ కేంద్రాలను ఎస్సై కె.కృష్ణప్రసాద్ గురువారం పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రం వద్ద వసతులు, బందోబస్తుకు అనువైన అంశాలను పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. పరిశీలనలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ కె.సూర్యభరత్ ఉన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి



ఓటు హక్కుపై అవగాహన ర్యాలీను నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఏపీఎం రామ్మూర్తి తెలిపారు. పూడివలస, ధర్మవరం, ముద్దాడ, కొయ్యాం, కేశవరావుపేట గ్రామాల్లో, ఎచ్చెర్ల ఎచ్చెర్ల టీటీడీసీ కేంద్రంలోని శిక్షణ పొందుతున్న విద్యార్థులకు గురువారం ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అవగాహన ర్యాలీలు, సమావేశాలు నిర్వహించారు. వెలుగు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సంతోషిమాతకు జన్మనక్షత్రపూజలు



సంతోషిమాతకు క్షీరాభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత ఆలయంలో అమ్మవారికి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, క్షీరాభిషేకం, శ్లోత్రం, శ్రీసూక్తం విధానంగా షోడశోపచార సహిత సహస్ర నామార్చన కుంకుమార్చనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో సుకన్య, అర్చకులు కిరణ్‌శర్మలు మాట్లాడుతూ.. ఏప్రిల్ 11 నుంచి 13వ తేదీ వరకు చండీయాగం సహిత సహస్ర ఘటాభిషేకం, పంచాయతన యాగ మహోత్సవం జరుగుతాయని తెలిపారు. 13 పట్టు చీరలతో చండీహోమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మూలమూర్తికి సహస్ర ఘటాభిషేకాలు జరుగుతాయన్నారు. భక్తులంతా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

జగనన్నను మళ్లీ సీఎంను చేయాలి



ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌ను బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్న సర్పంచ్ కుటుంబం

ఎచ్చెర్ల క్యాంపస్: రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేలా క్యాడర్ అంతా ఐక్యంగా పనిచేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ధర్మవరం సర్పంచ్ అల్లు కన్నబాబు ఇంటికి వెళ్లి గురువారం వ్యక్తిగతంగా కలిశారు. ఎమ్మెల్యేను సర్పంచ్ కుటుంబ సభ్యులు సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో అందరికీ సమాన ప్రాధాన్యత ఇచ్చానని, రానున్న ఎన్నికల్లో అందరూ సహకరించాలని కోరారు. ప్రజాసంక్షేమం కోసం మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావాలన్న లక్ష్యంతో పనిచేయాలన్నారు. పార్టీ నాయకులు రుప్ప కృష్ణ, బట్న లక్ష్మణరావు ఉన్నారు.

ఓటింగ్ శాతం పెంచాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో బూత్ లెవల్ అధికారి భూపతి నర్సింగరావు ఆధ్వర్యంలో గురువారం ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు కాలనీలో ర్యాలీ నిర్వహించి ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మురపాక మురిసేలా

- రూ.6.46 కోట్లతో మురపాక-2 సచివాలయం పరిధి గ్రామాల అభివృద్ధి
- గ్రామాల్లో ప్రభుత్వ భవనాల ఏర్పాటు
- సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణం

ఊరు మారింది



మురపాక-2 సచివాలయం

ఎచ్చెర్ల: పట్టణాలను తలపించే విధంగా పల్లెలు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయి. ఇంతవరకు ఏ ప్రభుత్వమూ చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసి చూపించింది. లావేరు మండలంలోని మురపాక-2 సచివాలయంలో పీబీ నగర్ కాలనీ, గుంటుకుపేట, చిన్నయ్యపేట, పండిపేట గ్రామాలున్నాయి. ఈ గ్రామాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.6.46 కోట్లతో అభివృద్ధి చేశారు. సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం, సీసీ డ్రైనేజ్ నిర్మించారు. నాడు-నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు. సీసీ రోడ్లు, బీటీ రోడ్డు మరమ్మతులు చేశారు. ఇంటింటికీ కుళాయిలు, వర్మీకంపోస్ట్ యార్డ్, జగనన్న గృహాలు నిర్మించారు. అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. గత ప్రభుత్వ పాలనలో ఈ గ్రామాల నుంచి పట్టణాలకు రావాలంటే గోతుల దారిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. జగనన్న పాలనలో రహదారులు అభివృద్ధి జరగడంతో ప్రయాణాలను సునాయాసంగా సాగిస్తున్నారు.

అభివృద్ధి పనులు ఇలా..

- రూ.43.6 లక్షలతో నూతన సచివాలయం భవనం. -రూ.24.15 లక్షలతో రైతు భరోసా కేంద్రం.
- రూ.20.80 లక్షలతో విలేజ్ హెల్త్ క్లీనిక్ సెంటర్.
- రూ.15.74 లక్షలతో బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్.
- ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా రూ.50 లక్షల వ్యయంతో పది సీసీ రోడ్లు నిర్మాణం.
- జీజీఎంపీ, ఎంపీపీ నిధుల ద్వారా 17.50 లక్షలతో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు నిర్మాణం.
- మనబడి నాడు-నేడు ద్వారా కేజీబీవీతోపాటు ఎంపీపీఎస్, ఎపీయూపీఎస్ పాఠశాలల్లో రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు.
- మనబడి నాడు-నేడు ద్వారా రూ.2.15 లక్షలతో మూడు అంగన్‌వాడీల్లో అభివృద్ధి పనులు.
- జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.109 లక్షలతో తాగునీటి సదుపాయం.
- 106 మంది హౌసింగ్ లబ్ధిదారులకు రూ. 1.90 కోట్ల నిధులు మంజూరు.
- 15వ వార్షిక ప్రణాళిక ద్వారా వివిధ అభివృద్ధి పనులకు రూ.23 లక్షల కేటాయింపు.



విలేజ్ హెల్త్ క్లీనిక్ సెంటర్



రైతు భరోసా కేంద్రం



గుంటుకుపేట నుంచి మురపాక గ్రామానికి సీసీ రోడ్డు నిర్మాణం



సీసీ డ్రైనేజీ నిర్మాణం

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి



ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌కు విజయ తిలకం దిద్దుతున్న మహిళ

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: రానున్న ఎన్నికల్లో ప్రజలంతా వైఎస్సార్‌సీపీని సంపూర్ణంగా మద్దతు తెలిపి మరలా జగన్ మోహన్‌రెడ్డిని సీఎంగా ఆశీర్వదించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ కోరారు. మండలంలోని మహంతిపాలెం, కృష్ణాపురం పంచాయతీల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఈ ఐదేళ్లల్లో సీఎం జగన్ చేసపట్టిన సంక్షేమ పాలన ఇలాగే కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. జగనన్న పాలనలో వృద్ధులకు కష్టం తెలియకుండా ఇంటికే పింఛన్‌ను వలంటీర్లతో పంపిస్తున్నారని, పిల్లల చదువులకు అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వస్తున్నాయన్నారు. నాడు-నేడుతో పాఠశాలలు బాగుపడ్డాయని, గ్రామాల్లో సచివాలయ వ్యవస్థ నెలకొల్పి గ్రామ స్వరాజ్య పాలన తీసుకువచ్చారన్నారు. రైతన్నలకు ఆర్‌బీకేలల ద్వారా విత్తనాలు, ఎరువులు అందించడం, ధాన్యం, మొక్కజొన్న పంటల కొనుగోలు అన్నీ గ్రామాల్లోనే జరుగుతున్నాయని వివరించారు. వెన్నుపోటు రాజకీయాలు చేసే చంద్రబాబును నమ్మవద్దన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, పార్టీ మండల అధ్యక్షుడు మహంతి పెదరామినాయుడు, వైస్ ఎంపీపీలు రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, సర్పంచ్‌లు గొర్లె అప్పలనర్సునాయుడు, కంబపు రామిరెడ్డి, ఎంపీటీసీ మహంతి చినరామినాయుడు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలి



పోలింగ్ కేంద్రాలపై ఆరా తీస్తున్న ఉమామహేశ్వరరావు

జి.సిగడాం: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని మండల ఎన్నికల రిట్నరింగ్ అధికారి ఆర్.ఉమామహేశ్వరరావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లోని మౌలిక సదుపాయాలను బీఎల్‌ఓలు, వీఆర్‌ఓలు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. గ్రామాల్లో ఎన్నికల నియామవళిపై ప్రత్యేక నిఘా వేయాలని సూచించారు. గ్రామస్థాయి సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలన్నారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్ఐ జి.రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత అన్నిరంగాల్లో రాణించాలి

- మానవవనరుల అభివృద్ధిశాఖ ఛైర్మన్ చక్రపాణి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చక్రపాణి

శ్రీకాకుళం న్యూకాలనీ: యువత ఎంట్రప్రెన్యూర్స్ (వ్యవస్థాపకులు)గా ఎదగాలని, నిరుద్యోగులకు ఉపాధినిచ్చేస్థాయికి చేరుకోవాలని ఏపీ మానవవనరుల అభివృద్ధిశాఖ ఛైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణి ఆకాంక్షించారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురువారం ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ అండ్ లీడర్‌షిప్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. దేశంలో ఉన్న వివిధ వ్యవస్థాపనకు ఉన్న అవకాశాలను వివరించారు. అమెరికా కంపెనీ మూన్‌ప్రెన్యూర్ అందిస్తున్న ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం గురించి వివరించారు. ఈ కార్యక్రమం ఆన్‌లైన్ ప్రోగ్రాం అని.. ఈ కోర్సులో చేరిన విద్యార్థులకు రూ.12 వేలు స్టైఫండ్ అందజేస్తారని పేర్కొన్నారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అన్ని విషయాలపైన విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. నిరంతరం వివిధ పత్రికలను చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్ జయదేవ్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.హరిత, కళాశాల ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎం.ప్రదీప్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యాలు సాధించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకన్నబాబు

జి.సిగడాం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల లక్ష్యాలను సాధించకపోతే అటువంటి వారిపై చర్యలు తప్పవని ఎంపీడీఓ వెంకన్నబాబు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం టెక్నికల్ అసిస్టెంట్‌లు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాలు మేరకు గ్రామస్థాయిలో అర్హులైనందరికీ ఉపాధి పనులు కల్పించి, సకాలంలో వేతనాలు అందించాలన్నారు. ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, ఈసీ గేదెల పురిషోతంనాయుడు పాల్గొన్నారు.

17న సీతారాముల కల్యాణం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బొంతావీధిని కృష్ణార్జున మందిరంలో ఏప్రిల్ 17వ తేదీన సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు అర్చకులు పులఖండం శ్రీనివాసరావు, నిర్వాహకులు అందవరపు మురికయ్య, సింహాద్రి గోపాలకృష్ణ, అందవరపురామరావులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కల్యాణ వేడుకలను కేవలం 21 మంది దంపతులతో నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న దంపతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాల కోసం 99495 22653 నంబర్‌ను సంప్రదించాలి.

పాటల పోటీలకు ఎంట్రీలు నమోదు

శ్రీకాకుళం కల్చరల్: ఎంసీఏ ఆధ్వర్యంలో పాటల పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ఎం.భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. పోటీలకు సంబంధించిన తేదీని ఎన్నికల అనంతరం ప్రకటిస్తామన్నారు. ఈలోగా పోటీలో పాల్గొనదలచే వారు 96766 86693 నంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

భక్తితో సంకట హర చతుర్థి పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీగణపతి

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక మొండేటివీధిలోని శ్రీలక్ష్మీ గణపతికి సంకష్ట హర చతుర్థిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు హోమాలు గురువారం జరిగాయి. ఆలయ అర్చకులు, షిర్డీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్వామి అభిషేకాలు, గణపతి హోమం నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

టెక్కలి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా రేపు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 30వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జేకేసీ, జీఎంఆర్ రక్షా సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగి, 166 సెంటీమీటర్ల ఎత్తు కలిగిన అభ్యర్థుల కోసం సుమారు 60కు పైగా ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. అలాగే డిప్లమో పూర్తి చేసిన మహిళలకు ఎంఎస్‌సీ కంపెనీలో టెక్నీషియన్లుగా పనిచేసేందుకు 20కు పైగా ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయని, 154 సెంటీమీటర్లు ఎత్తు, 50 కేజీల బరువు కలిగిన మహిళా అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దాతల సాయంతో ఇంద్ర పుష్కరిణి పనులు



పనులు ప్రారంభిస్తున్న గ్రామపెద్దలు

టెక్కలి: కె.కొత్తూరు గ్రామంలోని కాశీ విశ్వేశ్వర ఆలయానికి ఆనుకుని ఉన్న ఇంద్ర పుష్కరిణి అభివృద్ధి పనులను దాతల సాయంతో గురువారం ప్రారంభించారు. సర్పంచ్ మొర్రి శంకర్ ఆధ్వర్యంలో దాతలు కోరాడ నాగభూషణ్, శ్రావణి దంపతుల సాయంతో పనులు చేస్తున్నారు. టెక్కలికి చెందిన షిర్డీసాయి చారిటబుల్ ట్రస్టు, శంకరవనం ఫౌండేషన్ ఛైర్మన్ దుక్క రమేష్‌రెడ్డి తనవంతు సాయంగా 25 వేల రూపాయలను అందజేశారు. కార్యక్రమంలో దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.దీప్తి, గ్రామ పెద్దలు బోళ్ల భాస్కరరావు, డి.సుభద్ర, మసేన్‌రెడ్డి, బొంగు బైరాగి, పావని, సీలాపు రామస్వామి, సుగ్గు దేవి, జల్లు సత్యం, ధర్మాన ప్రకాశ్, డి.భాస్కర్‌రావు, ఎం.ప్రసాద్, బి.ప్రసాద్, నాయుడు, కొండయ్య, మన్మథరావు, చిన్నాతో పాటు ఆలయ అర్చకుడు రామలింగయ్య, రమేష్‌శర్మ ఉన్నారు.

రంగస్థల కళాకారుడికి సన్మానం



రుద్రమూర్తిని సత్కరిస్తున్న కళా సంస్థ ప్రతినిధులు

పలాస: ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం బాపూజీ కళామందిరంలో గురువారం ప్రముఖ కళాకారుడు, నాటక రచయిత, దర్శకుడు లండ రుద్రమూర్తికి సన్మానం చేశారు. నాలుగు రోజుల పాటు జరిగే అఖిల భారత నాటిక పోటీల సందర్భంగా ఆయనను నిర్వాహకులు సత్కరించారు. సంస్థ అధ్యక్షుడు ఇప్పిలి శంకరశర్మ, కార్యదర్శి గుత్తు చిన్నారావుతో పాటు పలువురు కళాకారులు రుద్రమూర్తిని అభినందించారు.

ఎలక్ట్రానిక్ కాటాలకు సీల్ వేయించాలి



సీల్ వేసిన కాటాలు పరిశీలిస్తున్న తూనికలు, కొలత ఇన్‌స్పెక్టర్

సారవకోట: రేషన్ దుకాణాలు, ఇతర దుకాణాల్లో వాడుతున్న ఎలక్ట్రానిక్ కాటాలకు ఏడాదికొకసారి సీల్ వేయించాలని తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ ఎ.రాజారమేష్ సూచించారు. మండలంలోని 45 రేషన్ దుకాణాల్లో వినియోగిస్తున్న ఎలక్ట్రానిక్ కాటాలకు సీల్ వేసే కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. ఎలక్ట్రానిక్ కాటాలకు ఏడాదికొకసారి, గుల్లు కాటాలకు రెండేళ్లకొకసారి సీల్ వేయించాలన్నారు. సీల్ వేసే సమయంలో కాటా పనితీరు పరిశీలించి, ఏ మాత్రం హెచ్చుతగ్గులున్నా సరి చేసి ఇవ్వనున్నట్లు తెలిపారు. సిబ్బంది భార్గవి ఉన్నారు.

బాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: మండలంలోని ఎస్ఎస్ఆర్‌పురంలోని సాయి ఆశ్రమంలో సాయిబాబాకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడ ఉన్న బాబా మందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. బాబా విగ్రహానికి తిరువీధి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబాను దర్శించుకున్నారు.

ఆనందపురంలో..

జి.సిగడాం: మండలంలోని ఆనందపురంలో గురువారం 100 అడుగుల ఎత్తుగల వెంకటి సాయికోటి మహాస్థూపం, 46 అడుగుల నాగసాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిర్డీ సాయి బాబాకు పూజ్యగురువుల అమ్ముల సాంబశివరావు ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. ఆలయం ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ నిర్మాత మక్క వెంకటిసాయి, భక్తులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



జాబ్‌మేళాలో ప్రిన్సిపాల్ రబీన్‌కుమార్‌పాఢీ, కంపెనీ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రబీన్‌కుమార్‌పాఢీ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఫార్మాకంపెనీ ప్రతినిధులు గురువారం జాబ్‌మేళాను నిర్వహించారు. కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ ఫణిశాంక్ అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. 40 మంది అభ్యర్థులు హాజరవ్వగా ఐదుగురిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. అధ్యాపక సిబ్బంది శివకుమార్, సంతోష్‌కుమార్, నాగేశ్వరరావు, దుర్యోధన, శ్రీనివాసరావు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం..

బూర్జ: మండలంలోని ఓ.వి పేట ఏపీ మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఆన్‌లైన్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూప్‌లకు మార్చి 28 నుంచి మే 22వ తేదీ వరకు దరఖాస్తు చేయాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 10వ తరగతిలో ఉత్తీర్ణత పొందిన వారు అర్హులన్నారు. ఓసీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 ఫీజు చెల్లించాలన్నారు.

కేజీబీవీలో..

పోలాకి: కేజీబీవీ పాఠశాలల్లో 6వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గంగివలస ఎస్ఓ శారద తెలిపారు. ఏప్రెల్ నెల 11లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం ఉందన్నారు. ఇంటర్మీడియెట్‌లో బైపీసీ గ్రూప్ మాత్రమే ఉందన్నారు. తరగతికి 40 మంది వరకు ప్రవేశాలకు అవకాశం ఉందని, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న పురోహితులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని చొర్లంగిలో నిర్మించిన చౌడేశ్వరి సహిత చొర్లంగేశ్వర స్వామి సాంగ శివాలయ ప్రతిష్ఠామహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగిన ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టారు. గురువారం శివపార్వతుల కల్యాణం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, భక్తులకు అన్నసంతర్పణతో ముగిశాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ నిర్మాణంలో భాగంగా హిరమండలానికి చెందిన రఘుపాత్రుని శ్రీనివాస పట్నాయక్ ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగుకు రూ.2,91,000 విరాళంగా అందజేశారు. గ్రామ పురోహితులు నేతేటి రమణమూర్తి, తులగాంకు చెందిన విద్యోపాసకులు భాస్కరభట్ల దుర్గాప్రసాద్ శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్ఠలో గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిబంధనలు పాటించండి



మాట్లాడుతున్న ఆర్వో రామ్మోహన్‌రావు

నరసన్నపేట: రానున్న ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, కార్యకర్తలు విధిగా ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని నరసన్నపేట ఆర్వో రామ్మోహన్‌రావు అన్నారు. రాజకీయ పార్టీల నాయకులతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఇంటింటా ప్రచారానికి అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో అయితే 48 గంటలు, ఆఫ్‌లైన్‌లో అయితే 24 గంటల్లోగా దరఖాస్తులు చేసుకోవాన్నారు. వాహనాలకు మైక్‌లు, పార్టీ కార్యాలయాలకు అనుమతులు తప్పనిసరి అని అన్నారు. ప్రస్తుతం ఉన్న కార్యాలయాలకు, తెరవనున్న కార్యాలయాలకు అనుమతులు ఉండాలన్నారు. సీ-విజిల్ యాప్‌ను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదుల పేరిట ఇళ్లల్లో ఉన్న నాయకుల చిత్రాలను వీఆర్వోలు తొలగిస్తున్నారని, ఇదేం పద్ధతి అని వైఎస్సార్‌సీపీ నాయకులు బగ్గు రమణయ్య, రాజాపు అప్పన్న ఆర్వో దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై తగిన ఆదేశాలు ఇస్తామని ఆర్వో హామీ నిచ్చారు. సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదుదారుల పేర్లు బయటకు వెళ్తున్నాయని ఆర్వో దృష్టికి తీసుకువెళ్లారు. నరసన్నపేట తహసీల్దార్ కనకారావు, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.